బస్‌షెల్టర్ లేక అవస్థలు

- రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూపు
- వేసవిలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



రోడ్డుపై బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

గుర్రంపోడు : మండలకేంద్రంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందలు ఎదుర్కొంటున్నారు. పరిసర మండలాలన్నింటిలో బస్‌స్టేషన్‌లు ఉన్నా ఇక్కడ మాత్రం బస్‌స్టాండ్ నిర్మించలేదు. నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారిపై ఉన్న మండలకేంద్రానికి నిత్యం పలు గ్రామాల నుంచి ప్రజలు చేరుకుని ఇక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. నల్లగొండ, దేవరకొండ, నాంపల్లి, హాలియాలకు వెళ్లాలంటే మండల కేంద్రం కూడలిగా ఉంటుంది. బస్‌ల కోసం నడి రోడ్డుపై ఎండలో ఎదురు చూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేసవిలో ఆర్టీసీ తాత్కాలికంగా వెదురు తడకలతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. ఈసారి తాత్కాలిక బస్‌షెల్టర్ కూడ లేదు. బస్‌లు కూడా తమ ఇష్టం వచ్చిన చోట్ల డ్రైవర్లు ఆపుతుండటంతో ప్రయాణికులు ఉరుకులు, పరుగులతో లగేజీ తీసుకుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న పెద్ద వృక్షాలను గతంలో రోడ్డు విస్తరణలో తొలగించడంతో ఒక్క చెట్టు మాత్రమే ఉండగా ఆ చెట్టు కిందనే నిలబడాల్సి వస్తుంది. బస్ వచ్చినప్పుడు అవతలి వైపున వెళ్లాల్సి వచ్చి రోడ్డు దాటుతుంటే ప్రమాదాల బారిన పడుతున్నారు.1983లోనే పరిసర మండలకేంద్రాలన్నింటిలో బస్‌స్టాండ్ నిర్మాణాలు జరిగినా ఇక్కడ మోక్షం లభించలేదు. గత కొన్నేళ్లుగా రహదారి బంగ్లా ఆవరణలో బస్‌స్టేషన్ నిర్మాణం చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. రహదారి బంగ్లా ముందు భాగంలో రోడ్డు వెంట కనీసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు అక్కడి ఆక్రమణలు సమస్యగా మారడంతో పట్టించుకోవడం లేదు.

సులభ్ కాంప్లెక్స్ లేక కష్టాలు

మండలకేంద్రంలో ప్రయాణికులకు బస్‌స్టేషన్ ఉంటే మలమూత్ర విసర్జలకు వీలుగా ఉండేది. బస్‌స్టేషన్ లేక మండలకేంద్రంలో ఖాళీ స్థలం లేక కిలోమీటరు దూరం వెళ్లి బహిరంగ మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. దుకాణాదారులు, మండలకేంద్రానికి నిత్యం పనుల మీద వచ్చే ప్రజలు సులభ్ కాంప్లెక్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సులభ్ కాంప్లెక్స్‌ను రహదారి బంగ్లాలో నిర్మించేందుకు రూ.5లక్షలు మంజూరు కాగా నిధులు సరిపోక పనులు ప్రారంభం లేదు. అదనపు నిధులతో మంజూరుకు ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు మోక్షం లభించలేదు. ఇటీవల మండలకేంద్రానికి వచ్చిన రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఈ మేరకు ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. మండలకేంద్రంలో బస్‌స్టాండ్, సులభ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్, సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మించాలి



మండు వేసవిలో బస్‌ల కోసం ఎదురుచూస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు ఎదురు చూస్తూ నిలబడాల్సి వస్తుంది. సులభ్‌కాంప్లెక్స్ లేక మలమూత్ర విసర్జనకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు తాత్కాలికంగా నైనా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– ఈరపనేని రామారావు, గుర్రంపోడు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కూరగాయల మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఉదయం ఎన్‌ఎస్‌పీ క్యాంప్‌గ్రౌండ్‌లో వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అదేవిధంగా బస్టాండ్ ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్ద టీ తాగుతూ స్థానికులతో చర్చించారు. మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కార్మికుల అడ్డా వద్ద కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల్లో 5 గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేసి పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. గత బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో పేదలు అన్ని రకాలుగా దోపిడీకి గురయ్యారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేద కోసం ఆలోచించే పార్టీ అని, వారి సంక్షేమానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, తమ్మడబోయిన అర్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్వర్టుపై ఇల్లు నిర్మాణంపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : కోదాడ –జడ్చర్ల రహదారి ఆర్‌అండ్‌బీ కల్వర్టుపై ఇల్లు నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బసవోజు అశోక్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రెమడాల పరుశురాములు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వారు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోదాడ– జడ్చర్ల రహదారిపై అవంతీపురం గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ కల్వర్టును గ్రామానికి చెందిన దాసరి మంగమ్మ ఆక్రమించుకోని రేకుల షెడ్డు నిర్మంచుకుందని తెలిపారు. ఆ షెడ్డు వెనకాలే తన రెండు గుంటల భూమి ఉందని 2021లో కొనుగోలు చేశానని తెలిపారు. ముందు భాగంలో ఆర్‌అండ్‌బీ కల్వర్టు ఉండగా దానిపై నుంచే రాకపోకలు జరుగుతున్నాయని, ఆ కల్వర్టును ఆక్రమించుకోని అక్రమ నిర్మాణం చేశారని ఆరోపించారు. ఆ విషయంపై ఆర్‌అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పంచాయతీ కార్యదర్శికి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా షెడ్ తొలగించాలని ఆదేశించారని తెలిపారు. అక్రమ కట్టడాన్ని తొలగించకుండా ఆ గ్రామ ఎంపీటీసీ భర్త అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన తనపై కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్డును తొలగించి ఆర్‌అండ్‌బి కల్వర్టును కాపాడడంతోపాటు తనకు న్యాయం చేయాలని కోరారు.

తక్కువ కూలి ఇస్తున్నారని ఉపాధి కూలీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

మిర్యాలగూడ : తమకు పనికి తగ్గ కూలి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఉపాధి హామీ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ గ్రామంలో పూడికతీత పనులు తాము చేపడుతున్నప్పటికీ ప్రతి రోజు కూలి రూ.30 నుంచి రూ.60వరకే ఇస్తున్నారని వాపోయారు. చుట్టుపక్కల గ్రామాల్లో రూ.150కు పైగా కూలి ఇస్తుండగా మాకెందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఏ సౌజన్య తప్పుడు కొలతలతో తమను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఏపీడీతో పాటు పలువురు అధికారులు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఒత్తిడి పెంచేందుకు టీఏలు, అధికారులు ప్రయత్నించారని సమాచారం. కూలీల సమస్యను పరిష్కరించేందుకు గాను రూ.30కు బదులుగా రూ.150కు పైగా కూలీ చెల్లించేందుక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఈసీ కళావతిని, టీఏ రాజేశ్వరీలను వివరణ కోరగా తాము కూలీలకు రూ.150కు పైగా కూలీ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీవే మెజార్టీ స్థానాలు



కొప్పోలులో బీజేపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న సైదిరెడ్డి

పెద్దవూర : పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో పలు పార్టీలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి సైదిరెడ్డి పార్టీ కండువాలను కప్పి బీజేపీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో ఈసారి కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు. బీజేపీతోనే అవినీతి రహిత, సుస్థిర పాలన సాధ్యమన్నారు. దేశం యావత్తు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజు, యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు రాఖీ, రవికుమార్, రమేష్, రామకృష్ణ, నాగరాజు, ప్రశాంత్, వినోద్‌రెడ్డి, సతీష్, చారి, శంకర్, నరేష్, గణేష్, జనార్దన్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీస్వయంభూ గంగమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. నూతన నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలను ప్రతిష్ఠాచార్యులు రాయప్రోలు మురళి గురుస్వామి, శ్రీరామశర్మ, ప్రతాపురం వెంకటాచార్యులు, అబ్రపూడి రమణశర్మ, ఆధ్వర్యంలో ఈనెల 19న ప్రత్యేక పూజలు, 21న యంత్రరాజ ప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, గర్తన్యాసం, అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ సర్వదర్శనం, పూర్ణహుతి, శాంతికల్యాణం, 22న బోనాలు, బలిహరణ తదితర పూజలను ఘనంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోనీ రాజా రమేష్ యాదవ్, కాశయ్య, బూడిద గోవింద్, గంధం రామయ్య , శ్రీనివాస్, మల్లిఖార్జున్, రాజశేఖర్, బాలకృష్ణ, కొండల్, కూరాకుల శ్రీనివాస్, తిరుపతయ్య. ఆర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పెద్దవూర : తాళిబొట్టు చూపుతున్న పూజారి



కొండమల్లేపల్లి : రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దవూర : గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలోని రామాయలంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన కల్యాణ వేడుకను తిలకించేందుకు తెల్లవారుజామున నాలుగు గంటలకే పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి ఏడాది భద్రాద్రి తలంబ్రాలు మరుసటి రోజు తెల్లవారుజామున సీతారాముల కల్యాణం జరగడం అనవాయితీగా వస్తుంది. ఈ కల్యాణానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. అనంతరం మహిళలు వేసిన కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ కల్యాణానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పూజరి అన్నెపర్తి వెంకటరామశర్మ, శివాజీ శర్మ, దేవాలయ కమిటీ చైర్మన్ అయితగోని పరమేష్, మాజీ సర్పంచ్ జ్యోతిలింగారెడ్డి, ఎంపీటీసీ ఆవుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

కొండమల్లేపల్లి : శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా గురువారం మండల కేందంరలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయం వరకు గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మొదలైన రథోత్సవ ఊరేగింపు స్థానిక చౌరస్తా మీదుగా భక్తుల శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్‌నాయక్, నల్లగాసు జానియాదవ్, శిరందాసు కృష్ణయ్య, కేసాని లింగారెడ్డి, యుగేందర్‌రెడ్డి, వేమన్ రెడ్డి, యుగేందర్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, బూడిద వెంకటేశ్‌యాదవ్, గంధం సురేష్, మల్లేశ్‌యాదవ్, దేవాలయ మాజీ కార్యదర్శి నీలా లక్ష్మయ్య, బొడ్డుపల్లి శంకర్, చందా ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



హాలియా : స్పిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి

హాలియా : అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి జానయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పెద్దవూర మండలంలోని విశ్వనాథ స్పిన్నింగ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణపై యాజమాన్యం, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జానయ్య మాట్లాడుతూ ఎప్పుడైన పరిశ్రమలో ప్రమాదం జరిగిన వెంటనే 101కి డయల్ చేసి సమాచారం అందించాలని, ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లు ఎండీ కృష్ణంరాజు, పాల్గొన్నారు.

దేవరకొండ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం దేవరకొండలోని గ్యాస్ గోదాం వద్ద అగ్నిమాపక శాఖ అధికారులు గోదాం సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. దేవరకొండ అగ్నిమాపక అధికారి రాజునాయక్ మాట్లాడారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్యాస్ సిలిండర్ల ద్వారా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సునీల్‌వర్మ, నిరంజన్, పరబ్రహ్మం, ముత్యాలు పాల్గొన్నారు.

భాస్కర్‌రావును విమర్శించడం తగదు

మిర్యాలగూడ : మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుపై కాంగ్రెస్ నాయకుడు స్కైలాబ్‌నాయక్ విమర్శలు చేయడం తగదని దామరచర్ల జెడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాంనాయక్, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డిలు అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 6న పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఆ పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. సమావేశంలో భైరం సంపత్, రవీందర్‌నాయక్, శ్రీను, పున్నానాయక, పాచ్యానాయక్, ప్రకాశ్ నాయక్, సచిన్‌నాయక్, కుర్ర శ్రీనునాయక్, వీరనాయక్, ఫయాజ్, కొండల్, లపాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంత్ మృతిపై విచారణ జరపాలి

కొండమల్లేపల్లి : భువనగిరి గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్ మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దళిత రత్న బుర్రి వెంకన్న గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన విద్యార్థి మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అనాథ ఆశ్రమానికి కూలర్లు బహూకరణ



ఆశ్రమ నిర్వాహకుడికి కూలర్లు అందజేస్తున్న న్యాయవాది

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడకు చెందిన ప్రముఖ న్యాయవాది తడకమళ్ల రామ రంగారావు మనుమరాళ్లు వేదక్ష శ్రీవాత్సల, నందిత శ్రీచైతన్యలు తమ జన్మదినం సందర్భంగా పట్టణ సమీపంలో లోని దుబ్బతండా ఫెయిత్ బంజార అనాథ ఆశ్రమానికి రెండు కూలర్లు గురువారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు ధీరావత్ హన్యా నాయక్, రమాబాయి, గార్లపాటి ఉదయ్‌కిరణ్, గార్లపాటి హిమబిందు తదితరులున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థికి రెండో ర్యాంకు

మిర్యాలగూడ టౌన్ : సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీవీ రామన్ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పట్టణానికి చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. పట్టణంలోని షాబునగర్‌లోని సాయి గీతాంజలి స్కూల్‌లో చదువుతున్న వేద వ్యాస్ హైదరాబాద్‌లో ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు అవార్డును అందుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గుంటూరు గీత, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయులందరూ అభినందించారు.

పోషణ్ అభియాన్‌పై అవగాహన

చింతపల్లి : గ్రామాల్లోని బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ లావణ్యకుమారి కోరారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కేంద్రంలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్‌గా వెంకటేశ్వర్లు



మిర్యాలగూడ : కాంగ్రెస్ ఎస్సీ సెల్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన నర్సింగ్ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం నియామకపత్రం అందకున్నాడు. పార్టీలో తన సేవలను గుర్తించి తనకు ఈ పదవీని అప్పగించిన మాజీ మంత్రి జానారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్‌లు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

రాములోరి తలంబ్రాల బుకింగ్ గడువు పెంపు

మిర్యాలగూడ టౌన్ : భద్రాద్రి రాములోరి తలంబ్రాల బుకింగ్ గడువును ఆర్టీసీ ఈనెల 25వరకు పెంచిందని మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావులు తెలిపారు. గురువారం డిపోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా ఈనెల 18వ తేది వరకు బుకింగ్ అవకాశం ఉంటే, ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఆర్టీసీ గడువు పెంచిందని తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి హేయమైన చర్య

దేవరకొండ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి హేయమైన చర్య అని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేశ్ అన్నారు. గురువారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ కూటమి విద్యార్థి సంఘం గెలుపును జీర్ణించుకోలేక ఏబీవీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం నిరంతరం పోరాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేన్సర్ నివారణకు అందుబాటులో చికిత్సలు

మిర్యాలగూడ : కేన్సర్ నివారణకు నేడు ఆధునీక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని సోమాజిగూడ ఆస్పత్రి అంకాలజిస్టు, హెమటాలజిస్ట్ హరీశ్‌కంచర్ల అన్నారు. గురువారం పట్టణంలో కేన్సర్ నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారి ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు ఎక్కువ మోతాదులో తీసుకున్నట్లయితే కేన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. మహిళలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ వస్తున్నాయని, 35ఏండ్లు దాటిన ప్రతి మహిళ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సోమాజిగూడ యశోద ఆసుపత్రి మేనేజర్ పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాశ్, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కొండూరు భవాని

చింతపల్లి : గ్రామాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కొండూరు భవాని పవన్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కావడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదయ్య, కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వెంకటయ్య, ఎంపీడీఓ సుజాత తహసీల్దార్ విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

సైదులు మృతి ఉపాధ్యాయులకు తీరనిలోటు



సైదులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : త్రిపురారం యూటీఎఫ్ మండల అధ్యక్షులు సామ సైదులు ఆకాల మృతి ఉపాధ్యాయుల తీరని లోటగని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం తుంగపాడులోని కేఎస్‌ఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సైదులు దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదులు నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడటంతో పాటు పాఠశాల విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధికి పాటుపడేవారన్నారు. ఆయన అకాల మృతి ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాన్ని కలిచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బంజార ఉద్యోగుల సంఘం నాయకులు మక్లనాయక్, శంకర్ నాయక్, రాగ్యానాయక్, దాశివనాయక్, వెంకట్రాం నాయక్ తదితరులున్నారు.

దాతృత్వ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

హాలియా : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచితంగా రాగి జావను పంపిణీ చేస్తున్న దాతృత్వ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి పేలపూడి బాలకృష్ణ అన్నారు. దాతృత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువకులు వడ్డె సతీష్‌రెడ్డి, బండి రమేష్, మల్లిఖార్జున్, సీకే యూత్ సభ్యులు ఉన్నారు.



రాగి జావను పంపిణీ చేస్తున్న బాలకృష్ణ

అప్రమత్తతతో విధులు నిర్వహించాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

హాలియా : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు అన్నారు. గురువారం హాలియా పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు కేసుల దర్యాప్తు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాలియా సీఐ జనార్దన్ గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సులో రభస



సదస్సునుంచి బయటకు వెళ్లిపోతున్న మహిళా సంఘాల సభ్యులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీ బస్టాండులో గురువారం నిర్వహించిన ఓటుహక్కుపై అవగాహన సదస్సులో రభస చోటుచేసుకుంది. మహిళా సంఘాలకు రుణాలు ఇస్తున్నట్లు, రుణమాఫీ చేసేదానిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా సంఘాల లీడర్ల ద్వారా సభ్యులను సమావేశానికి పిలిపించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ వస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ కాకుండా మీటింగ్‌కు మోప్మా డైరెక్టర్ కరుణాకర్ హాజరై ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తుండగా ఒక్కసారిగా మహిళలు లేచి రుణాలు ఇస్తామని, రుణమాఫీపై సమావేశమని ఓటుహక్కు గురించి మాట్లాడుతున్నారేంటని నిలదీశారు. మహిళలు అసహనం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులను నిందిస్తూ సమావేశం నుండి మధ్యంతరంగా వెళ్లిపోయారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సమావేశాన్ని ముగించారు.

ఘనంగా అంకాలమ్మ జాతర



అమ్మవారిని పూజిస్తున్న భక్తులు

పెద్దవూర : గిరిజనులు ఆరాధ్యదైవంగా భావించే మండలంలోని రామన్నగూడెంలో కొలువై ఉన్న కంకాళి భవాని(అంకాలమ్మ), లాల్‌సాధ్, గురునానక్ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పర్వదినం రోజు సీతారాముల కల్యాణం నిర్వహించిన అర్ధరాత్రి దాటాక కంకాళిభవాని ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఎక్కడా లేని విధంగా కంకాళి భవానికి ప్రతి ఏటా భక్తులు దున్నపోతులను బలివ్వడం ఆనవాయితీగా వస్తుంది. గతంలో పదుల సంఖ్యలో దున్నపోతులను బలివ్వగా మూడేళ్ల నుంచి ఆచార సంప్రదాయాల ప్రకారం ఒకటి, రెండు బలి ఇచ్చి అమ్మవారికి మొక్కును తీర్చుకున్నారు. దున్నపోతుల బలిని ప్రతి యేడాది తెల్లవారుజాము 3 గంటలకు ఆలయ పూజారులు నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని తిలకించటానికి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ఈ జాతరకు జిల్లానుంచే కాక మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం తదితర జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి లారీలు, టూరిస్టు బస్సులు, ఆటోలలో ఒకరోజు ముందే తరలివచ్చి గుడారాలు వేసుకుని దేవాలయ పరిసరాలలో ఉన్నారు. వీరంతా గురువారం వేకువజామున దేవతకు దున్నపోతులను బలియిచ్చే కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులు తమ కోర్కెలు తీర్చుకునేందుకు యాటలను, దున్నలను దేవతలకు బలి ఇచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి ఇక్కడే భోజనాలు వండుకుని ఆరగించారు. గిరిజన భక్తులు దేవతలకు బెల్లం, రొట్టెలను, పరమాన్నంలను, విస్కీ, మటన్‌లను దేవతలకు సమర్పించి యాగాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.